దసరా కథల పోటీల్లో రెండవ బహుమతి పొందిన కథ

అగస్త్యప్రగడ హేమంత

# వ్యవస్థ

ఆధునిక భారతంలో
అతివలనణగార్చే
దుర్వ్యవస్థ



వాకిట్లో రిక్షా చప్పుడు వినిపించడంతో వీధివాకిలి ఊడ్చడానికొచ్చిన అన్నపూర్ణ పని విషయం మర్చిపోయి అలాగే నిలబడిపోయింది.

రిక్షాలోంచి కూతురు వాహిని, ఆమె అత్తగారు దిగడంతో చేతిలోని చీపుర్ని పక్కన పడేసి— "రండి, రండి" అంటూ హడావిడిగా వాళ్ళకి ఎదురెళ్ళింది. కూతురు చేతిలో ఉన్న పెద్ద సూట్ కేస్‌ని కాక, ఆమె అత్తగారి చేతిలో వున్న చిన్న బాస్కెట్‌ని అందుకుంది అన్నపూర్ణ. అవును మరి... బరువు మోసి కూతురు అలసినా ఫర్వాలేదు కానీ ఆమె అత్తగారు మాత్రం అలగకూడదు. అలిగితే ఇంకేమైనా ఉందా? అందుకే వియ్యపురాలికి అంత భయ పడేది.

ఇక వాళ్ళు ఒచ్చిన నిమిషం నుంచీ, వియ్యపురాలికి మర్యాదలు చెయ్యడంతో అన్నపూర్ణకి ఒక్క నిముషం కూడా తీరిక లేకుండా పోయింది. రెండు రోజులు సకల మర్యాదలూ పొందాకా ఇక బయల్దేరేముందు ఒచ్చిన విషయం చెప్పింది వాహిని అత్తగారు.

"మీ అమ్మాయికి వారం రోజుల్నించీ ఒంట్లో బాగుండట్లేదు. ఒకటే వాంతులు... నీరసం... బహుశా నెల తప్పిందనుకుంటాను... అందుకే నాల్రోజులు రెస్ట్ తీసుకుంటుందని ఇక్కడ దిగబెట్టి వెడుతున్నాను. మా వాడొద్దామనుకున్నాడు. కానీ శలవు దొరకలేదు. ఇంక నాకు రాక తప్పలేదు..." అంటూ ఊపిరి పీల్చుకోవడం కోసం ఆగిందావిడ.

ఆ ఆగిన నిమిషంలోనే— "అవడానికి మా అమ్మాయే అయినా మా పిల్ల నెల తప్పింది మీ వాడి వల్ల. పైగా అది పిల్లల్ని కని ఉద్ధరించేది కూడా మీ వంశాన్నే కదా! అలాంటప్పుడు, మీ వంశాన్ని నిలబెట్టే పిల్లని అపురూపంగా చూసుకోవలసిన బాధ్యత మీ మీదే ఉంటుంది. నీరసంగా ఉన్నప్పుడు వైద్యం చేయించడం మా వంతు. బలంగా ఉన్నప్పుడు పని చేయించుకోవడం మీ వంతూనా?" అని అన్నపూర్ణ ఆవిడని నిలదీయవచ్చు. కానీ ఆవిడ కాదు కదా ఏ ఆడపిల్ల తల్లీ ఈ విషయం అడగదు.

ఎందుకంటే ఆడపిల్ల పుట్టింటి దగ్గర రెస్ట్ తీసుకోవడం, అత్తింటి దగ్గర వాకిరీ చెయ్యడం, మన వ్యవస్థలో సాంప్రదాయమైపోయింది. అంతే కాదు... నోరు తెరిచి ఇదేమిటని అడిగే హక్కు ఆడపిల్లకీ, ఆమె తల్లిదండ్రులకీ కూడా లేదు. అసలా మాటకొస్తే ఈ దేశంలో రాజ్యాంగం మాట ఏమోగానీ, 'ఆచార సాంప్రదాయాల' రీత్యా చూస్తే ఆడపిల్లగల వాళ్ళకి వాక్ స్వాతంత్ర్యం లేదు. అందుకే అన్నపూర్ణ మాట్లాడలేదు.




మౌనంగా ఉన్నవాళ్ళు మాట్లాడే వాళ్ళకి లోకువ. మగాణ్ణికన్న వాళ్ళకి ఆడపిల్లల తల్లితండ్రులు లోకువ. కోరేవాడికి ఇచ్చేవాడు లకువ. అందుకే తనే వాహిని శ్రీమంతానికి ఏమేం చెయ్యాలో 'లిస్ట్' చదవ గలిగింది ఆమె అత్తగారు.

"శ్రీమంతం ఘనంగా చెయ్యాలి" మొదటి కోరిక నవ్వుతూ వెలి బుచ్చిందావిడ. అన్నపూర్ణకి నవ్వు రాలేదు. అయినా బలవంతంగా నవ్వి "అలాగేలెండి" అంది.

ఆ మాట అంటుంటే రెండు నెలల క్రితమే వాహిని పెళ్ళి ఘనంగా చెయ్యడానికి చేసిన వేల 'అప్పు' ఆమె కళ్ళముందు కదలాడింది. అయినా అన్నపూర్ణ మాత్రం ఏం చెయ్యగలదు? అక్కడికీ అభిమానం ఒదిలేసి, ఆవిడ ముందు సాష్టాంగపడి, "మాకు బోళ్ళంత అప్పు ఉంది" అని చెప్పినా, "అప్పుంటే ఆడపిల్లనెందుక్కన్నారూ! అసలు ఆడపిల్లంటేనే అప్పు కదా!" అంటుందావిడ వెంటనే. అలా అనే హక్కు ఆవిడ స్వంతం.

ఇలాంటి సమయాల్లో జన్యువులూ, సైన్సూ పని చెయ్యదు. అసలీ వ్యవస్థే అలాంటిది. అందుకే ఆవిడ చెప్పిన దానికి అన్నపూర్ణ తలూపింది.

"ఏడో నెలన చెయ్యడం మా ఆనవాయితీ. శ్రీమంతంలో పదికాసుల వెండి పళ్ళెంలో పళ్ళు పెట్టే ముందుగా మాకందించాలి" రెండో షరతు

కూడా పూర్తి వేసిందావిడ. తల అడ్డంగా తిప్పుదామనుకుంది అన్నపూర్ణ. కానీ కూతురి కాపురం కూలిపోతుందేమోనన్న భయంతో ''అలాగే'' అన్నట్టు తలూపింది.

ఆ నిమిషంలో రాత్రనక, పగలనక, కిరాణా కొట్లో ఎకౌంట్స్ రాస్తూ, అటు ఉద్యోగం చూసుకుంటూ, కష్టపడుతున్న భర్త ఆరోగ్యం కళ్ళ ముందు నిలిచింది. అయితే మాత్రం ఏం చెయ్యగలదు?

కానీ... మీకూ 'అరకాసు' బంగారం పెట్టాలి. అది మా ఆనవాయితీ అని మాత్రం చెప్పలేకపోయింది. అసలా మాటకొస్తే ఆవిడ తెగించి చెప్పినా అది జరగదు. మగపిల్లాణ్ణే కన్నవాళ్ళు ఆచార సాంప్రదాయాల్ని చెరిపేసినా చెల్లిపోతోంది. కానీ ఆడపిల్ల వాళ్ళ విషయం అలా కాదుగా. అందుకే అన్నపూర్ణ మాట్లాడలేకపోయింది.

''నాకు పట్టుచీర పెట్టాలి. ఇక శ్రీమంతం అవనీండి. బారసాల సంగతి తర్వాత చూద్దాం'' ఆఖరి మాట కూడా చెప్పేసి రిక్షా ఎక్కింది వాహిని అత్తగారు. ఆవిడ అవన్నీ అనునయంగా చెప్పినా అవి ఆజ్ఞాపనలకిందే లెక్క.

ఏవిటీ ఆచారాలూ! ఆనవాయితీలూ! నాన్సెన్స్ అంటే... అనర్థం జరుగుతుంది. మరి ఆచారాన్ని అడ్డు పెట్టుకుంటే అవతలి వాడి నుంచి మనక్కావలసినంత గుంజుకోవచ్చు. ఆనవాయితీ తప్పిస్తే అవతల వాళ్ళకోపమొస్తుంది. ఒస్తే మన మీద కక్ష సాధిస్తారు. ఇది అనర్థమే కదా!

ఇప్పుడు వాహిని కాపురం చల్లగా ఉండాలంటే అది వాళ్ళ ఆనవాయితీలని అమలు జరపడంలో ఉంది. ఆ విషయం తెలుసుగనుకనే అన్నపూర్ణ ఆలోచనలో పడింది.

పెళ్ళికి అయిన అప్పు ఇంకా తీరనేలేదు. ఓ పక్క పాడవుతున్న భర్త ఆరోగ్యం... మరోపక్క ఎదుగుతున్న వాహిని గర్భం... ఇంకోవైపు అప్పు మీద పెరుగుతున్న వడ్డీ... వేరేవైపు వాహిని అత్తగారి ఆచారాల తీరు... ఇవికాక నెలనెలా కాబోతున్న డాక్టర్ పీజులూ... మందుల ఖర్చులూ... ఆ తర్వాత పురుడు... బారసాల ఖర్చులూ... వెరసి ఇరవై వేల వరకూ పని ఉంటుంది.

ఇవన్నీ ఆలోచించి లెక్కలు వేసుకుంటుంటే అన్నపూర్ణకి తల తిరగడం మొదలెట్టింది. ఏం చెయ్యాలి?... చూస్తూ చూస్తూ అప్పుల్లో మునిగిపోవడమా? లేక మార్గాంతరం ఆలోచించడమా? ఆలోచిస్తున్న ఆవిడలో ఘర్షణ ప్రారంభమైంది. సమస్యతో ఆ 'ఆడపిల్ల తల్లి మనసు' అతలా కుతలం అయిపోయింది.



## కబీర్-నిక్కీకిగల సంబంధం

కబీర్‌బేడి ఎప్పుడు అవుట్‌డోర్ షూటింగ్‌లకి వెళ్ళిన అతని వెంట అతని భార్య ఉండదట. ప్రేయసి నిక్కీ ఉంటుందట. కారణం అడిగితే— ''మేమిద్దరం మంచి స్నేహితులము. ఒకరి కంపెనీని ఒకరం ఎంజాయ్ చేస్తాము. సాధ్యమైనంత వరకు మేమిద్దరం కలిసి ఉండడానికి ప్రయత్నిస్తాము. ఇలా ఉండడం తప్పు లేదనుకుంటాను'' అని చెపుతున్నాడు.

వాహానికి మాత్రం తల్లినవుతున్నానన్న ఆనందం తప్ప ఇవేమీ తెలియవు కాదు... అత్తవారడిగినవన్నీ అప్పు చేసయినా అప్పజెప్పడం పుట్టింటి వాళ్ళ 'బాధ్యత' అని వాహిని అభిప్రాయం.

ఆలోచించి... ఆలోచించి... అన్నపూర్ణ బుర్ర వేడెక్కింది. ఈ సమస్యని భర్తతో చెబుదామంటే చేసిన అప్పుని తీర్చుకునే హడావిడిలో ఉన్న ఆయన్ని మళ్ళీ కొత్త సమస్యలోకి లాగడం ఆవిడకిష్టం లేకపోయింది. అందుకే బ్రద్దలవుతున్న అగ్ని పర్వతాలన్నిటినీ ఆమె భరిస్తోంది.

వేల కొంది అగ్నిపర్వతాలు విస్ఫోటనాన్ని నిరంతరం భరిస్తున్న కొందరాడవాళ్ళముందు, హాలాహలం మింగిన హరుడు ఏపాటివాడు?

చివరికి అన్నపూర్ణ ఒక నిర్ణయానికి ఒచ్చేసింది. ఆ పరిస్థితిల్లో ఆమె కది సమంజసంగానే తోచింది. అది తప్ప మరో పరిష్కారం ఆమెకి కనిపించలేదు. వెంటనే తన నిర్ణయాన్ని కూతురికి చెప్పలేక చెప్పిందా తల్లి. అది విన్న వాహిని నిర్ఘాంతపోయింది.

''ఏవిటమ్మా!... ఏవిటి నువ్వు మాట్లాడేది?... అసలు... నీకు మనసుందా?'' అంది బాధ ఆవేశం కలగాపులగం కాగా.

''మనసుంది... కానీ ఏం లాభం? మనసుండి మనీ లేని మధ్య తరగతి తల్లిని నేను. ఓ మధ్య తరగతి వ్యక్తికి భార్యని. తండ్రిగా నీ బాగు చూడ్డం ఆయన విధి. కూతురుగా ఆయన్ని అడిగి తీసుకు వెళ్ళడం నీ హక్కు... కానీ ఆయన విధికీ నీ హక్కుకీ మధ్య, భార్యగా, తల్లిగా నలిగిపోతున్న మధ్య తరగతి వ్యక్తి నమ్మా నేను... అందుకే నాకు మనసుండీ లాభం లేదు. ఆకలి బాధ, ఆర్థిక సమస్య, మనిషిని ఎంతటి పనికైనా ప్రోత్సహిస్తాయి. ఇప్పుడు... నీ విషయంలో 'అబార్షన్' సలహా ఇవ్వడానికి దోహదం చేసిన పరిస్థితి కూడా ఇదే... కనీసం రెండేళ్ళు... పోనీ ఏడాది... ఒక్క ఏడాది టైమివ్వు... ఈ లోపల మేం కాస్త కాలూ చెయ్యి కూడ దీసుకుంటాం... మీ వాళ్ళు అడిగినవన్నీ పెడతాం... నీ భవిష్యత్‌తో పాటు, మా భవిష్యత్ కూడా ఆలోచిస్తే... ఇక ఇంతకంటే మార్గం కనిపించడం లేదు... ఆలోచించు'' చెప్పి కళ్ళు తుడుచుకుంది అన్నపూర్ణ.

మొదట వాహిని ఒప్పుకోలేదు. కానీ తర్వాత చెప్పిందే చెప్పి, అడిగి, అర్థించి, చివరికి ఆమెకి అబార్షన్ చేయించింది అన్నపూర్ణ.

కూతురు తల్లి కాబోతుందని ఆనందించాల్సిన సమయంలో, అలాంటి హీన పరిస్థితి ఒచ్చినందుకు, కూతుర్ని దగ్గరికి తీసుకుని కుమిలిపోయిందా తల్లి.

ఆర్థిక సమస్య మూలంగా తన తియ్యటి కల కరిగి పోయినందుకు, తల్లి ఒడిని ఆశ్రయించి ఏడ్చిందా కూతురు.

తల్లీ కూతుళ్ళ రోదనతో ఆ ఇల్లు ప్రతిధ్వనించింది.

ఇలాంటి కనిపించని వేదనలూ, వినిపించని రోదనలూ, సనాతన సాంప్రదాయ ఆచార్య వ్యవహారాలు గల ఈ వ్యవస్థలో ఇంకా ఎన్నో... ఎన్నెన్నో...

అలవాటే ఆచారమై బతుకుల్ని అస్తవ్యస్తం చేస్తుంటే, సరదాలే సాంప్రదాయాలై అదే చివరికి చావులకి సైతం దారి తీస్తుంటే... ఇలాంటి పరిస్థితుల్లో ఈ వ్యవస్థ ఎటు పోతోంది?

మనిషికే భారమై, చివరికది ఘోరమై, సౌఖ్యాన్ని, శాంతినీ, దూరం చేసే ఈ ఆచార వ్యవహారాలూ, సనాతన సాంప్రదాయాలూ, ఎందుకు? దేనికి? ఇలాంటి వ్యవస్థ మనకి అవసరమా? ఈ సాంప్రదాయాల్ని మనం జాగ్రత్తగా కాపాడుకోవాలా? ఈ ప్రశ్నకి సమాధానం?...

□■